
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5న చంద్రబాబు రాక



విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'రా...కదలిరా' పేరుతో ఈనెల ఐదో తేదీన అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం గొండుపాలెంలో జరగనున్న సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఐదో తేదీ ఉదయం విశాఖ నగరానికి చేరుకుని ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గొండుపాలెం వెళతారు. అక్కడ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం ఏలూరు జిల్లా చింతలపూడి వెళతారు.

ప్చ్...





మధ్యంతర బడ్జెట్‌పై వేతన జీవుల పెదవివిరుపు

- ఆదాయ పరిమితి పెంచుతారని ఆశించిన ఉద్యోగులు
- పాత విధానం కొనసాగుతుందన్న కేంద్ర మంత్రి
- ఇతర కేటాయింపులపైనా స్పష్టత కరువు
- రైల్వే జోన్ పనులు ప్రారంభం కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమన్న రైల్వే మంత్రి
- స్థలం కేటాయించలేదని వెల్లడి
- 'ఉడాన్' కింద ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు మరిన్ని విమానాలు
- విశాఖకు పెరగనున్న సర్వీస్‌లు
- తీరంలో ఆక్వా పార్కులు ఏర్పాటు చేస్తామని ప్రకటన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర మధ్యంతర బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న వేతన జీవులను మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా నిరాశపరిచారు. కేవలం మూడు నెలల కోసం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఉద్యోగులు అంతా ఆదాయ పన్ను పరిమితి పెంచుతారేమోనని ఆశగా ఎదురుచూశారు. కానీ పాత విధానమే కొనసాగుతుందని ఆమె ఒక్క మాటలో తేల్చి పడేశారు. ఇక మిగిలిన కేటాయింపులపైనా స్పష్టత లేదు. విశాఖ రైల్వే జోన్ ప్రస్తావన లేదు. అయితే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాత్రం జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించలేదని పేర్కొన్నారు. కాగా, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ఉడాన్ పథకం కింద మరిన్ని విమానాలు నడుపుతామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల విశాఖకు కొన్ని విమానాలు వచ్చే అవకాశం ఉంది.

తీర ప్రాంతాల్లో ఆక్వా పార్కులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సముద్ర తీర ప్రాంతం 130 కిలోమీటర్లపైనే ఉండడంతో ఒకటి, రెండు ఏర్పాటుచేసే అవకాశం ఉంది. ఆర్థిక రంగాన్ని పరుగులు తీయించడానికి రైల్వే శాఖ మూడు కారిడార్లను నిర్మిస్తుందని వెల్లడించారు. ఇందులో ఒకటి ఖనిజాలు, సిమెంట్ రవాణాకు కాగా మరొకటి పోర్టులను అనుసంధానం చేస్తుంది. ఇంకోటి అధిక రద్దీ ఉన్న ప్రాంతాలను కలుపుతూ వేస్తారు. విశాఖ జిల్లాలో రెండు పోర్టులు ఉండడం వల్ల లాజిస్టిక్స్ రంగం విస్తరిస్తుంది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

పర్యాటక రంగానికి ఊపు తేవడానికి ... మిగతా 6వ పేజీలో

వేతన జీవులకు ఊరట ఏదీ?



- కేవీడీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, విశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం

కేంద్రం వేతన జీవులకు ఎటువంటి ఊరట కలిగించలేదు. ఆదాయ పన్ను శ్లాబులు గతంలాగే ఉంచింది. వాటి వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. ఎక్కువ పెన్షన్ కోసం కొన్ని నెలలుగా డబ్బులు చెల్లిస్తున్నా ఎంత ఇస్తారనే దానిపై ఇప్పటికీ విధానపరమైన నిర్ణయం ప్రకటించలేదు. స్టీల్ రంగానికి ఎటువంటి రాయితీలు ఇవ్వలేదు.

మహిళలకు ఉపాధి అవకాశాలు



- జి.సాంబశివరావు, శ్రావణ్ షిప్పింగ్

కేంద్రం లక్ష కోట్ల రూపాయలు రుణాలుగా అందిస్తామని ప్రకటించింది. దీనివల్ల లాజిస్టిక్స్ రంగం విస్తరిస్తుంది. ప్రపంచ బ్యాంక్ నిబంధనల ప్రకారం ఈ రంగంలో 100 శాతం మహిళలు ఉండాలి. వారికి నైపుణ్య శిక్షణ కూడా ఇస్తారు. రైల్వే కారిడార్ల వల్ల పోర్టు కనెక్టివిటీ పెరుగుతుంది. ఎగుమతులు పెరుగుతాయి. ఆశించిన అభివృద్ధి సాధ్యమవుతుంది.



సమరమే..

నేటి నుంచి నగరంలో భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్ట్ మ్యాచ్

వేదికగా ఏసీఏ వీడీసీఏ స్టేడియం

- తొలి టెస్టులో గెలుపుతో ఉత్సాహంగా బరిలోకి ఇంగ్లండ్
- కలిసొచ్చిన పిచ్‌పై టీమిండియా విజయంపై అభిమానుల ఆశలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 1:

ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న రెండో టెస్ట్‌కు భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు సిద్ధమయ్యారు. మ్యాచ్ కోసం మంగళవారం నగరానికి చేరుకున్న ఇరు జట్ల ఆటగాళ్లు బుధ, గురువారాల్లో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో ఓటమితో సిరీస్‌లో వెనుకబడిన టీమిండియా విశాఖ మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు తొలి టెస్టులో విజయంతో ఉత్సాహంగా ఉన్న ఇంగ్లండ్ జట్టు సిరీస్‌లో ఆధిక్యాన్ని కొనసాగించాలనే ధ్యేయంతో ఉంది. దీంతో మ్యాచ్ రసవత్తరంగా జరిగే అవకాశం ఉంది.

కలిసొచ్చిన పిచ్‌పై ఆశలు

ఇక్కడి పిచ్ భారత్‌కు కలిసొస్తుందని అభిప్రాయాలున్నాయి. ఈ పిచ్‌పై జరిగిన (వన్డే, టీ20, టెస్టు వంటి అన్ని ఫార్మట్లు) మ్యాచ్‌లలో భారత్ తొంభై శాతం విజయాలు సాధించింది. గతంలో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌లలో భారత్ జట్టు భారీ తేడాతో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే టెస్టులో కూడా గెలుపు ఖాయమని అభిమానులు ఆశాభావంతో ఉన్నారు. అలాగే ఈ పిచ్‌పై దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలతో కదంతొక్కిన రోహిత్‌శర్మపై భారీ అంచనాలు ఉన్నాయి. విరాట్ కొహ్లి, రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ జట్టుకు దూరం కావడంతో యువ ఆటగాళ్ల శుభమన్ గిల్, శ్రేయాస్ అయ్యార్, జైస్వాల్‌పై భారత్ బ్యాటింగ్ ఆధారపడి ఉంది.

ప్రధాన అస్త్రాలుగా స్పిన్నర్లు

స్పిన్నర్లే ప్రధాన అస్త్రాలుగా ఇరు జట్లు బరిలోకి దిగే అవకాశాలున్నాయి. తొలి టెస్టులో ఇంగ్లండ్ స్పిన్నర్ టామ్ హార్ట్లీ బౌలింగ్‌లో భారత్ బ్యాట్స్‌మెన్లు తడబడ్డారు. హార్ట్లీకి బషీర్ తోడు కావచ్చు. ఇక భారత్ స్పిన్నర్ అశ్విన్‌కు ఇక్కడి పిచ్‌పై మంచి రికార్డు ఉంది. జడేజా స్థానంలో సిరాజ్ ఆడే అవకాశాలు ఉన్నాయి.

ప్రధాన ఆకర్షణగా లోకల్ బాయ్ భరత్



కేఎస్ భరత్‌ను సన్మానిస్తున్న సీపీ రవిశంకర్ అయ్యనార్

లోకల్ బాయ్ కోన శ్రీకర్ భరత్ ఈ మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. వికెట్ కీపర్ అయిన భరత్...హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో నాలుగు క్యాచ్‌లు పట్టడంతోపాటు బ్యాటింగ్‌లోనూ (తొలి ఇన్నింగ్స్‌లో 41, రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులు) రాణించాడు.

టాస్ కీలకం

ఈ మ్యాచ్‌లో టాస్ కీలకంగా మారనున్నది. రెండో రోజు నుంచి పిచ్ స్వభావం మారే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంటుందని నిపుణులు భావిస్తున్నారు.

ఏసీపీల బదిలీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో ఏసీపీలుగా పనిచేస్తున్న ఏడుగురిని బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈస్ట్ ఏసీపీగా పనిచేస్తున్న డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తిని తాడేపల్లిగూడెం డీఎస్పీగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో కాకినాడ దిశ స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న బీఎం జయరాంప్రసాద్‌ను నియమించింది. అలాగే టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పనిచేస్తున్న ఎ.త్రినాథరావును శ్రీకాకుళం స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో శ్రీకాకుళం ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్‌జీవీ ప్రసాదరావును నియమించింది. సీసీఎస్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎ.వెంకటరావును గ్రేహౌండ్స్‌కు బదిలీ చేసి, ఆయన స్థానంలో రామచంద్రాపురం డీఎస్పీగా పనిచేస్తున్న టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను, మెరైన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావును నూజివీడు డీఎస్పీగా బదిలీచేసి, ఆయన స్థానంలో శ్రీకాకుళం స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా పనిచేస్తున్న కె.బాలరాజును, ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తున్న ఎం.జాన్‌మనోహర్‌ను ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో సీటీసీ డీఎస్పీగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును ... మిగతా 6వ పేజీలో

ఒక్కొక్కరికి రెండు, మూడు ఓట్లు

ఓటర్ల జాబితాలో వెలుగుచూస్తున్న తప్పులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తుది ఓటర్ల జాబితాలో తప్పులు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. ఒకే వ్యక్తికి రెండు అంతకంటే ఎక్కువ ఓట్లు ఉండడం, ఒకే ఫొటోతో వేర్వేరు వ్యక్తులకు ఓటు కల్పించడం వంటి విచిత్రాలు చోటుచేసుకున్నాయి. విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని 42వ వార్డులో నివసిస్తున్న ఒకరికి మూడు ఓట్లు ఉన్నాయి. సుబ్బలక్ష్మి కళ్యాణ మండపం ప్రాంతంలో పోలింగ్ బూత్ నంబర్-3 పరిధిలో ఇంటి నంబర్ 43-11-32/3ఎఫ్3లో ఉంటున్న పి.రేణుకాదేవికి మూడు ఓట్లు (ఓటర్ల జాబితాలో వరుస సంఖ్య 1362, 1344, 1330 పేరిట) ఉన్నాయి. ఇదే కాలనీలో ఇంటి నంబరు 43-12-8/4, ఫ్లాట్ నంబరు 5, జయ రెసిడెన్సీలో నివసిస్తున్న తేజోమూర్తుల మహాలక్ష్మికి రెండు ఓట్లు (వరుస సంఖ్య 1402, 1405) ఉన్నాయి. ఇంటి నంబర్ 43-11-29/5లో ఉంటున్న భాగవతీసింగ్ కుటుంబం ఆయన కుమారులు సర్వేశ్‌సింగ్ (జాబితాలో వరుససంఖ్య 553), బ్రిజేష్‌సింగ్ (వరుస సంఖ్య 554)కు ఒకే ఫొటో కనిపిస్తోంది.

ఊరించి... ఉసూరుమనిపించి



మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామంటూ ఆశలు కల్పించిన ప్రభుత్వం

- చివరకు ఎన్నికల ముందు 6,100 పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం
- రాజకీయ లబ్ధి కోసం వైసీపీ ప్రభుత్వం హడావిడి
- ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని జగన్ ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ నిరుద్యోగుల ఆగ్రహం

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ విడుదల చేస్తామంటూ ఎప్పటినుంచో నిరుద్యోగులను ఊరిస్తూ వచ్చిన వైసీపీ ప్రభుత్వం చివరకు ఉసూరుమనిపించింది. గడిచిన ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకపోవడంతో కనీసం ఎన్నికల ముందైనా 20 వేల పోస్టులు భర్తీ చేస్తుందని ఆశించారు. కానీ, అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేవలం 6,100 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ సంఘ నాయకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఆరు వేల ఖాళీలను భర్తీ చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన జగన్మోహన్‌రెడ్డి...ఐదేళ్లకు కలిపి 6,100 పోస్టులను భర్తీ చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇది కూడా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకేనని ఆరోపిస్తున్నారు. గడిచిన ఐదేళ్ల నుంచి ఇళ్లకు వెళ్లకుండా కోచింగ్ ... మిగతా 6వ పేజీలో

పోస్టుల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ విడుదల చేయాలి



- రాజు, డీవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

గడిచిన ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం...ఎన్నికల ముందు నామమాత్రపు పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధం కావడం దారుణం. రాష్ట్రవ్యాప్తంగా పది లక్షల మంది డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగుల ఇబ్బందులు, ఆవేదనను దృష్టిలో ఉంచుకుని మెగా డీఎస్సీ విడుదల చేయాలి. కనీసం 20 వేల పోస్టులను భర్తీచేయాలి. మెగా డీఎస్సీ కోసం పోరాటాన్ని కొనసాగిస్తాం.

తీవ్ర అన్యాయం



- ఎడ్ల వాసు, డీఎస్సీ అభ్యర్థి

గడిచిన ఐదేళ్లుగా డీఎస్సీ కోసం కోచింగ్ తీసుకుంటున్నా. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా నోటిఫికేషన్ విడుదల చేయలేదు. మెగా డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ ఇస్తారన్న ఆశతో ఉన్నాం. ఇప్పుడు నామమాత్రపు పోస్టులతో డీఎస్సీ విడుదల చేయడం దారుణం. ఐదేళ్లుగా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న మాలాంటి నిరుద్యోగులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు నా ముఖాన్ని ఎలా చూపించాలో అర్థం కావడం లేదు.

ఆసరా మీటింగ్‌కు రావాల్సిందే, లేదంటేనా...

- డ్వాక్రా గ్రూపు సభ్యులకు రీసోర్స్ పర్సన్ల బెదిరింపు

'సిద్ధం' సభకు బస్సులు ఖాళీగా వెళ్లాయి, మేం నవ్వుల పాలయ్యాం

గాజువాక, ఫిబ్రవరి 1: "ఆసరా మీటింగ్‌కు డ్వాక్రా గ్రూపు సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలి. ఏ ఒక్కరు రాకపోయినా మా పని మేం చేస్తాం. సీఎం జగన్ 'సిద్ధం' సభకు చాలామంది రాలేదు, బస్సులు ఖాళీగా వెళ్లాయి, మేం...నవ్వుల పాలయ్యాం. ఈసారి అలా కుదరదు...' అంటూ డ్వాక్రా గ్రూపు సభ్యులను రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) బెదిరిస్తున్నారు. ఈ మేరకు ఫోన్‌లకు మెసేజ్‌లు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే...గాజువాక నియోజకవర్గానికి సంబంధించి 'ఆసరా' సమావేశం శుక్రవారం లంకా గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి జన సమీకరణ బాధ్యతను రీసోర్స్ పర్సన్లకు వైసీపీ నేతలు అప్పగించారు. దీంతో డ్వాక్రా గ్రూపు సభ్యులు ప్రతి ఒక్కరూ సమావేశానికి రావాలంటూ ఆర్పీలు వాయిస్ మెసేజ్‌లు పంపారు. రానిపక్షంలో ఏం చేయాలో తమకు తెలుసునంటూ బెదిరించడం పట్ల డ్వాక్రా గ్రూపు సభ్యులు మండిపడుతున్నారు. ప్రభుత్వపరంగా నిర్వహించే ప్రతి సమావేశానికి రావాలంటే ఎలా కుదురుతుందని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఇబ్బందిపెట్టడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల సీజన్ ప్రారంభం

- నేడు ఇంటర్ విద్యార్థులకు ఎథిక్స్ పరీక్ష
- రేపటి 'పర్యావరణ విద్య' పరీక్ష 23కి వాయిదా
- ఐదు నుంచి ఒకేషనల్ విద్యార్థులకు, 11 నుంచి జనరల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సీజన్ శుక్రవారం నుంచి మొదలుకానున్నది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ (నైతికత, మానవీయ విలువలు) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల మూడో తేదీన పర్యావరణ విద్యపై పరీక్ష ఉంటుందని ఇంటర్ బోర్డు అధికారులు తొలుత ప్రకటించారు. అయితే అనివార్య కారణాలతో ఈ పరీక్షను ఫిబ్రవరి 23వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు గురువారం రాత్రి ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాలకు ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చారు. ఈ రెండు పరీక్షలకు విశాఖ జిల్లాలోని 172 కళాశాలల్లో 40,873 మంది విద్యార్థులు హాజరవుతారు. కాగా ఈ నెల ఐదో తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. జిల్లాలో గల సుమారు మూడున్నర వేల మంది విద్యార్థులకు 20వ తేదీ వరకు దశలవారీగా ప్రాక్టికల్స్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లుచేశారు. జనరల్ కేటగిరీలో ... మిగతా 6వ పేజీలో

'గోదావరి' @ 50

అర్ధ శతాబ్దం పూర్తి చేసుకున్న రైలు



- వివరాలు IIలో

ఆర్‌కే బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జి

- తెన్నేటి పార్కు వద్ద ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతి నిరాకరణ



కురుసుర సబ్‌మెరైన్ సమీపాన ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో తేలియాడే (ఫ్లోటింగ్) బ్రిడ్జి ఏర్పాటు కార్యక్రమం తెన్నేటి పార్కు నుంచి ఆర్‌కే బీచ్‌కు మారింది. విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పర్యాటకుల కోసం ఈ ప్రాజెక్టును చేపట్టింది. ప్లాస్టిక్ బ్లాకులతో తీరం నుంచి సముద్రంలోకి కొంత దూరం వరకు ఈ బ్రిడ్జి నిర్మిస్తారు. సముద్ర అలలు వచ్చినప్పుడు ఈ బ్రిడ్జి పైకి కిందికి లేస్తుంది. వింత అనుభూతిని కలిగిస్తుంది. దీనికి వీఎంఆర్‌డీఏ ఎటువంటి నిధులు వెచ్చించదు. కాంట్రాక్టరే డిజైన్ చేసుకొని, నిర్మించుకొని నిర్వహించుకోవాలి. పైలట్ ప్రాజెక్టుగా మూడేళ్లు నిర్వహించాలి. ఏడాదికి రూ.15.3 లక్షలు వీఎంఆర్‌డీఏకు చెల్లించాలి. పైలట్ ప్రాజెక్టు పూర్తయిన తరువాత విధి విధానాలు నిర్ణయిస్తారు. పర్యాటకుల నుంచి ఫీజుల రూపంలో ఆదాయం సమకూరుతుంది. తొలుత దీనిని తెన్నేటి పార్కు సమీపాన నిర్మించాలని ప్రతిపాదించారు. ప్లాస్టిక్ బ్లాకులన్నీ అక్కడికి తీసుకువెళ్లారు. వాటిని చూశాక అటవీ శాఖాధికారులు తమ అనుమతి లేకుండా ఆ ప్రాజెక్టు అక్కడ పెట్టడానికి వీల్లేదని అంక్షలు పెట్టారు. అనుమతి కోసం ఫైల్ పెట్టి, దానిని మళ్లీ ఢిల్లీకి పంపాలంటే చాలా సమయం పడుతుందని అధికారులు భావించారు. కురుసుర సబ్‌మెరైన్ ఆవరణ మొత్తం వీఎంఆర్‌డీఏ ఆధీనంలో ఉండడం, అక్కడ దీనిని నిర్వహించుకుంటే ఎవరి అనుమతి అవసరం లేదని భావించి... తెన్నేటి పార్కు నుంచి ఆర్‌కే బీచ్‌కు మార్చేశారు. ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. వారం, పది రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నేటి నుంచి టెన్నిస్ క్వాలిఫైయింగ్ పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 1: ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో భాగంగా శుక్రవారం నుంచి క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు గురువారం నగరానికి చేరుకున్నారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ప్రేమ్‌చంద్, డీఎస్ఎన్.రాజు, సతీష్, కృష్ణంరాజు పేర్కొన్నారు.

పూర్ణామార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు

» వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 1: సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్) రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిపై వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు చర్యలకు దిగారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వనాథం గురువారం పూర్ణామార్కెట్‌లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రోడ్డు మీద జంగిళ్లతో వ్యాపారం చేస్తూ నిత్యం వాహన రాకపోకలకు ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారికి పూర్ణామార్కెట్‌లో మేడ పైన ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోకి పంపే ప్రయత్నం చేశారు. పూర్ణామార్కెట్‌లో సరకులు, కూరగాయల కొనుగోలుకు వచ్చేవారు పార్కింగ్ స్థలం ఆక్రమణలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్ణామార్కెట్ ఆశీలు కాంట్రాక్టర్ రోడ్లపైన వ్యాపారాలను ప్రోత్సహిస్తూ, వారి నుంచి అక్రమంగా ఆశీలు వసూలుకు పాల్పడుతుండడంతో ఫుట్‌పాత్, రోడ్లు, వాహనపార్కింగ్ స్థలాలు చిరు వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయని ఎప్పటి నుంచో వర్తక సంఘాలు ఆరోపిస్తున్నాయి. మార్కెట్ లోపల అద్దెలు చెల్లించి వ్యాపారం చేస్తున్నవారికి రోడ్డుమీద వ్యాపారాలతో



పూర్ణామార్కెట్ రహదారిలో ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈనేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు మార్కెట్ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి సారించడంపై వినియోగదారులతో పాటు, వర్తకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించే నేతను ఎన్నుకోవాలి



మహారాణిపేటలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

మర్రిపాలెం, ఫిబ్రవరి 1: నిత్యం ప్రజల మధ్య ఉంటూ, సమస్యలను పరిష్కరించే నాయకులనే ప్రతినిధులుగా ఎన్నుకోవాలని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. గ్రేటర్ 54వ వార్డు మర్రిపాలెం మహారాణిపేటలో గురువారం ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గంలోని అన్ని వార్డులో సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేశానన్నారు. మళ్లీ ఓటువేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాళ్ల అదిబాబు, రాంబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావు



ప్రసాదరావును అభినందిస్తున్న పోలీసు సిబ్బంది

మర్రిపాలెం, ఫిబ్రవరి 1: కంచరపాలెం ట్రాఫిక్ సీఐగా అమిటి ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీఐ మళ్ల అప్పారావుతోపాటు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ప్రసాదరావు నగరంతోపాటు శ్రీకాకుళంలోని పలు పోలీసుస్టేషన్‌లో లాఅండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల్లో పనిచేశారు. పదోన్నతుల్లో భాగంగా కంచరపాలెం ట్రాఫిక్ సీఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వాసుదేవరావు, ఉల్‌హక్, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ: కలెక్టర్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 1: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ త్వరితగతిన జరుగుతోందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. వీలైనంత త్వరగా స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను సొసైటీ కార్యవర్గం కలిసింది. ఇప్పటికే దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన పూర్తయిందని, అర్హులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు జి.జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్, పీపీ రావు, రమేష్, శ్రీనివాసరావు, శివప్రసాద్, చిట్టిబాబు, అనురాధ, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

43వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ



కరపత్రాలు అందిస్తున్న బొడ్డేటి మోహన్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 1: గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ ఆధ్వర్యంలో గురువారం 131 నెంబరు పోలింగ్ బూత్ పరిధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని పిలుపునిచ్చారు.

ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో రైల్వే జీఎం తనిఖీలు



డిటెక్షన్ యూనిట్లను ప్రారంభిస్తున్న మనోజ్‌శర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 1: తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ గురువారం ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో తనిఖీ చేశారు. యూనిట్లు, సిబ్బంది సౌకర్యాలను పరిశీలించారు. సాంకేతిక నిపుణులు, సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఎలక్ట్రో మాగ్నెటిక్ ట్రాక్ డిటెక్షన్ యూనిట్, ఎయిర్ డ్రైయిర్ టెస్ట్ బెంచ్, లోకో బాడీ వాషింగ్ అండ్ క్లీనింగ్, వర్షం నీరు లీకేజీ డిటెక్షన్ యూనిట్లను ప్రారంభించారు. డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, ఏడీఆర్ఎంలు, ఇతర బ్రాంచి అధికారులు పాల్గొన్నారు.

చదువుపైనే దృష్టి సారించాలి: డీఈవో



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈవో చంద్రకళ

సీతమ్మధార, ఫిబ్రవరి 1: ప్రతి విద్యార్థి చదువుపైనే దృష్టి పెట్టి లక్ష్యం చేరుకునే విధంగా మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి లంక చంద్రకళ పేర్కొన్నారు. సీతమ్మధార పిఅండ్‌టి కాలనీలో గల ఎన్ఎంసి హెచ్ పాఠశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ట్యాబ్‌లను చదువు నిమిత్తం వాడుకోవాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా ఆలకించాలన్నారు. నోట్ పుస్తకాలను పరిశీలించారు. తరగతి గదుల్లో బెంచీలు లేవని ఆమె దృష్టికి తేవడంతో మరో స్కూల్‌లో ఉంటే తెప్పుకోవాలని హెచ్ రాంప్రసాద్‌కు సూచించారు.

జనసేనలో చేరిన మహిళలు



పార్టీలో చేరిన వారితో ఉత్తర నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 1: గ్రేటర్ 44వ వార్డు జనసేన అధ్యక్షుడు పడాల పరమేశ్వరరావు అధ్యక్షతన గురువారం జనంతో జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డేటి హేమ కల్యాణి, ఉండమట్ల వరలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఆ పార్టీలో చేరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ముమ్మిన నాగమణి, భాస్కర్, సంధ్యా మాధురి, ఏసు, ఆచంట కిరణ్, సత్యప్రసాద్, గణేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

48వ వార్డు కార్యవర్గం ఏర్పాటు

కంచరపాలెం: జనసేన 48వ వార్డు అధ్యక్షుడిగా ఉప్పులూరి శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారి నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయమే ధ్యేయంగా కార్యకర్తలంతా పని చేయాలన్నారు.

ప్రజా పక్షపాతి బాలకృష్ణ: మాజీ ఎమ్మెల్సీ శర్మ



బాలకృష్ణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శర్మ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 1: ప్రజా పక్షపాతి కామ్రేడ్ ఎ.బాలకృష్ణ అని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ కొనియాడారు. గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ సంతాప సభకు డా.బి.గంగారావు అధ్యక్షత వహించారు.ముందుగా బాలకృష్ణ చిత్ర పటానికి శర్మతో పాటు జీవీఎన్ చలపతి, ఎస్.సుధాకర్, జగ్గునాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నం విద్యార్థి ఉద్యమంలో బాలకృష్ణ చురుకైన పాత్ర పోషించారన్నారు. ఉద్యమకారుడిగా, కార్మిక కర్షక పక్షపాతిగా పేరు సంపాదించుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేఎస్వీ కుమార్, జగన్, పద్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

'మతాన్ని రాజకీయం చేస్తున్నారు'

సీతమ్మధార, ఫిబ్రవరి 1: మతాన్ని రాజకీయం చేస్తున్నారని ఆర్‌పీఐ జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్‌లో గురువారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ప్రధాన పూజారి అయ్యారని, రాముడు రాజకీయ నాయకుడు అయ్యాడన్నారు. రాజకీయ చైతన్యం ప్రజల్లో కల్పించే ఉద్దేశంతో ఈ నెల 4న అంబేడ్కర్ భవన్‌లో సభ నిర్వహిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 1: నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఏఎస్ఆర్‌నగర్, వోల్వో ఆఫీస్, మైత్రి ఇన్, వుడా చిల్డ్రన్ పార్క్ ఏరియాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

ప్ఛే..

... 5వ పేజీ తరువాయి

అన్ని రాష్ట్రాల్లో ఐకానిక్ టూరిస్ట్ సెంటర్లను ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఏపీకి విశాఖపట్నం పర్యాటక రాజధాని కాబట్టి ఇక్కడ ఓ సెంటర్ పెట్టే అవకాశం ఉంది.

» మెట్రో రైళ్లు, నమో భారత్ రైళ్లు పెంచుతామని ప్రకటించారు. విశాఖ మెట్రో ప్రాజెక్ట్ విషయం వెల్లడించలేదు. రాష్ట్రం డీపీఆర్ పంపించామని చెబుతోంది. అది అందిందో లేదో కూడా తెలియదు.

» గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఆఫ్ షోర్ విండ్ ఎనర్జీని ప్రోత్సహించాలని నిర్ణయించారు. సముద్ర తీర ప్రాంతాల్లో వీటిని పెడతారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలు దీనికి అనుకూలం. కొత్త పెట్టుబడులు వస్తాయి.

బాలికలకు తప్పనున్న క్యాన్సర్ ముప్పు



దేశంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు చాలా అధికం. దీనిని ముందుగానే నివారించడానికి 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చాయి. వాటిని ప్రభుత్వమే ఉచితంగా వేస్తుందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల ఎంతో మంది లబ్ధి కలుగుతుంది. భవిష్యత్తులో ఈ తరహా క్యాన్సర్ కేసులు తగ్గిపోతాయి. అయితే విదేశాల్లో ఈ వ్యాక్సిన్ మగపిల్లలకు కూడా ఇస్తున్నారు. ఇక్కడ కూడా అలా చేయాలి.

- డాక్టర్ మురళీకృష్ణ, మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి

ఊరించి... ఉసూరుమనిపించి

... 5వ పేజీ తరువాయి

సెంటర్లు చుట్టూ తిరుగుతూ, రూముల్లో ఉండి చదువుకుంటున్న తమను ప్రభుత్వం దగా చేసిందని డీఎస్సీ అభ్యర్థి రామకృష్ణ వాపోయాడు. ఈ మోసానికి వేలాది మంది జీవితాలు నాశనమయ్యాయని స్వాతి అనే అభ్యర్థిని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని నిరుద్యోగ సంఘ నాయకుడు రాజు హెచ్చరించారు.

ఆరేళ్ల కిందట చివరి నోటిఫికేషన్..

చివరిసారిగా 2018లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఆ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 7,900 పోస్టులను భర్తీచేశారు. అయితే నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఆయన మాటలు నమ్మి గత ఎన్నికల్లో నిరుద్యోగులు వైసీపీకి ఓటేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి మర్చిపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి కావస్తోంది. ఇప్పటివరకూ ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేసిన పాపాన పోలేదు. ఎన్నికలకు కొన్నిరోజులు ముందు, అదీ నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో నామమాత్రపు పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆనందం లేకుండాపోయింది

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైందన్న ఆనందం నిరుద్యోగులకు లేకుండా పోయింది. అరకొర పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడమే కాకుండా మళ్లీ అప్రెంటిస్ విధానాన్ని తీసుకురావడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుంది. పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు ఆ విధానాన్ని రద్దు చేయాలి. కనీసం 20 వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలి.

- ఎం.రాజేష్, డీఎస్సీ అభ్యర్థి

పరీక్షల సీజన్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఎంపీసీ విద్యార్థులు 32,982 మంది, బైపీసీ విద్యార్థులు 4,945 మంది హాజరవుతారు. తొలి దశలో ఈనెల 11 నుంచి 15 వరకు 129 కళాశాలలు, రెండో దశలో 16 నుంచి 20 వరకు 102 కళాశాలల విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. 50 మంది కంటే తక్కువ ఉన్న కళాశాలల్లో ప్రాక్టికల్స్‌కు సెంటర్లు కేటాయించలేదు. ఇటువంటి కళాశాలల విద్యార్థులకు సమీపంలోని మరో కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం అవుతాయి.

ఏసీపీల బదిలీ

... 5వ పేజీ తరువాయి

నియమించింది. స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా పనిచేస్తున్న వై.గోవిందరావును కోనసీమ జిల్లా దిశ స్టేషన్ డీఎస్పీగానూ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.బాపూజీని అన్నమయ్య జిల్లా దిశ స్టేషన్ డీఎస్పీగా బదిలీచేసింది. ఇప్పటివరకూ ఖాళీగా ఉన్న నార్త్ సబ్‌డివిజన్ ఏసీపీగా కృష్ణా జిల్లా సీసీఎస్ డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్ మురళీకృష్ణను, ద్వారకా ఏసీపీగా కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.రాంబాబును నియమించింది.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

అల్లిపురం, ఫిబ్రవరి 1: జీవీఎంసీ 34వ వార్డు పరిధిలోని లబ్ధిదారులకు ఇటీవల మంజూరైన 59 ఇళ్లపట్టాలను వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో గురువారం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో రోడ్లు,డ్రైనేజీలు వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ నాయకులు లింగం శ్రీను, లండ రమణ, యూసీడీ సీఓ మంగ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు బదిలీల్లో పలుకుబడికే ప్రాధాన్యం

» మండలాలకు కేటాయింపుల్లోనూ వారిదే పైచేయి

» అల్లూరి, మన్యం జిల్లాలకు మహిళల కేటాయింపుపై అసంతృప్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జోన్-1లో జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యత ఇచ్చారని రెవెన్యూ ఉద్యోగుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం నగరాలకు ఆనుకుని పనిచేసిన తహసీల్దార్లు కోరుకున్న జిల్లాలకు కేటాయించారు. చివరకు జిల్లాల పరిధిలో పోస్టింగ్స్ ఇవ్వడంలో పలుకుబడి గల వారికే అనుకూలమైన మండలాలు కేటాయించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో పలుకుబడిలేని తహసీల్దార్లల్లో ఎక్కువ మందికి పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీ చేశారని అంటున్నారు. ఇంకా పలువురు మహిళలకు మైదాన జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం కాకుండా అల్లూరి, మన్యం జిల్లాలకు పంపారని గుర్తు చేస్తున్నారు. విశాఖ నగరం చుట్టూ మండలాల్లో పని చేస్తున్న తహసీల్దార్లలో తమకు నమ్మకంగా ఉండే వారిని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కేటాయించారని పేర్కొంటూ ఆయా జిల్లాల్లో కూడా వారు కోరుకున్న మండలాల్లో పోస్టింగ్స్ ఇచ్చారని రెవెన్యూ వర్గాల్లో చర్చ సాగుతుంది.

విశాఖ నగర శివారుల్లో డీ పట్టా భూములను పాలకపార్టీ పెద్దలకు కొనిపెట్టే వ్యవహారంలో పరిధికి మించి పనిచేసిన తహసీల్దార్లకు మంచి మండలాలకు బదిలీ చేశారన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వరకు తీరం పొడవునా ఉన్న మండలాల్లో సుమారు 1000 ఎకరాల డీపట్టాభూములు కొనుగోలు చేయాలని పాలక పెద్దలు, సీనియర్ అధికారులు కొందరు ప్రణాళిక వేసుకున్నారు. దాని మేరకు ఇప్పటికే కొంతమేర డీ పట్టా భూములను రైతుల నుంచి కొనుగోలుకు మార్గం సుగం చేశారని రెవెన్యూలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అనుకున్న మేర భూముల కొనుగోలుకు ఇబ్బంది లేకుండా తమకు నమ్మకమైన తహసీల్దార్లకు జాతీయ రహదారి పరిసర మండలాలకు కేటాయింపులో పాలక పెద్దలు రెవెన్యూ ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. నగర శివారుల్లో పనిచేసి పలు రకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్లను పనిష్మెంట్‌పై దూర ప్రాంత మండలాలకు పంపాలి కానీ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో జాతీయ రహదారి, జిల్లా కేంద్రాలకు ఆనుకుని మండలాల్లో పోస్టింగ్స్ ఇచ్చారని రెవెన్యూ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇదిలావుండగా శ్రీకాకుళం జిల్లాలో పనిచేసే మహిళా తహసీల్దార్లు, విశాఖ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసే మహిళను తీసుకెళ్లి అల్లూరి సీతారామరాజు, మన్యం జిల్లాలకు కేటాయించడాన్ని రెవెన్యూ వర్గాలు తప్పుబడుతున్నాయి. సాధారణ ఎన్నికలు ముగిసిన తరువాత పనిచేసే జిల్లాలకు తహసీల్దార్లంతా తిరిగి వస్తారు. అయితే అప్పటి వరకు పలుకుబడి ఉన్న వారంతా, పాలక పెద్దల అవసరాలు తీర్చే వారికి తగిన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కోరుకున్న మండలాల్లో పోస్టింగ్స్ తీసుకున్నారని రెవెన్యూ ఉద్యోగి ఒకరు వ్యాఖ్యానించారు.

హిందీకి పెరుగుతున్న ఆదరణ

» డీఆర్‌డీవో డీజీ డాక్టర్ వై.శ్రీనివాసరావు

» రాజభాష సైంటిఫిక్ అండ్ టెక్నికల్ సెమినార్ ప్రారంభం

గోపాలపట్నం, ఫిబ్రవరి 1: దేశం మొత్తం ఐక్యంగా ఉంచే మాధ్యమంగా హిందీ భాష కీలకపాత్ర పోషిస్తుందని, శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికతను అనుసంధానం చేయడంలో రాజభాషకు ఆదరణ పెరుగుతుందని డీఆర్‌డీవో డీజీ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. అఖిల భారత సంయుక్త రాజభాష సైంటిఫిక్ అండ్ టెక్నికల్ సెమినార్ ఎన్ఎస్‌టీఎల్‌లోని మానసి ఆడిటోరియంలో గురువారం ప్రారంభమైంది. డీఆర్‌డీవో హైదరాబాద్ క్లస్టర్ పరిధిలో నిర్వహించిన ఈ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజభాష అభివృద్ధికి ఎన్ఎస్‌టీఎల్ చేస్తున్న కృషిని అభినందించారు. ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్ పీజే నివారే మాట్లాడుతూ దేశ సరిహద్దులను సురక్షితం చేయడంతో డీఆర్‌డీవో ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. సాంకేతికత బదిలీ, సమన్వయానికి ఎన్ఎస్‌టీఎల్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. డీఆర్‌డీవో డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసింగ్ రాజభాషను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ మాట్లాడుతూ నౌకాదళం కోసం అత్యాధునిక ఆయుధాలను తయారుచేయడంలో ఎన్ఎస్‌టీఎల్ కృషిని వివరించారు.



డాక్టర్ వై.శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వరుగీస్

రెండు రోజుల పాటు జరిగే ఈ సెమినార్‌లో జరిగే చైతన్యవంతమైన చర్చలు శాస్త్రీయ, సాంకేతిక పురోగమనానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెమినార్ చైర్మన్ సి.కేదర్‌నాథ్, ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రహదారులే ఫంక్షన్ హాళ్లు!



శుభ కార్యక్రమం కోసం టెంట్లు వేసి గాజువాక వినాయకనగర్ రోడ్డును మూసివేసిన దృశ్యం

శుభ కార్యక్రమాల నిర్వహణ కోసం తరచూ రోడ్లను మూసివేస్తున్న స్థానికులు
తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గాజువాక, ఫిబ్రవరి 1: గాజువాకలోని పలు ప్రధాన రహదారులు శుభ కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. పలు చోట్ల ఉన్న కల్యాణ మండపాలను సచివాలయాలుగా మార్చడంతో అత్యధికులు రహదారులపై టెంట్లు వేసి శుభ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తరచూ ఆయా కార్యక్రమాల నిర్వహణ కోసం నిర్వాహకులు రోడ్లను మూసివేస్తుండడంతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డెకరేషన్స్‌తో కూడిన సైడ్ వాల్స్‌తో రహదారులను మూసేస్తుండడంతో రాకపోకలు సాగించడం కుదరడం లేదని, దీంతో గమ్య స్థానాలకు చేరుకునేందుకు నానా పాట్లు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్వాహకులతో వాహనదారులు వాగ్వాదాలకు కూడా దిగుతున్నారు. రోడ్డుపై కనీసం చిన్నదారి కూడా ఇవ్వకుండా మూసివేయడం దారుణమని పలువురు వాపోతున్నారు. అందువల్ల రోడ్లను పూర్తిగా మూసివేయకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

చురుగ్గా అండర్ పాస్‌వే పనులు



అండర్ పాస్‌వేలోకి వెళ్లే మార్గంలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 1: గత నెలలో నిర్మించిన చంద్రనగర్ అండర్ పాస్‌వేలో రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సింహాచలం రైల్వే స్టేషన్ వెనక భాగంలో గల చంద్రనగర్ నుంచి పాత గోపాలపట్నం గ్రామానికి కలిపే ఈ మార్గంలో అండర్ పాస్‌వే నిర్మాణాన్ని ఇటీవల చేపట్టారు. గోపాలపట్నం దిగువ ప్రాంతంలో గల ఆదర్శనగర్, చంద్రనగర్ రైల్వే గేట్ల కారణంగా సరైన రవాణా వ్యవస్థ లేక దశాబ్దాల కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేలాది మంది ప్రజలకు చంద్రనగర్ వద్ద అండర్ పాస్‌వే నిర్మాణం చేపట్టడంతో కాస్త ఊరట లభించనున్నది.

రెండు నెలల్లో పనుల పూర్తికి అధికారుల ప్రణాళికలు
అందుబాటులోకి వస్తే ప్రజల ఇక్కట్లు తీరినట్టే

ఇటీవల నిర్మించిన ఈ అండర్ పాస్‌వే నుంచి రాకపోకలు సాగించేలా దీనికి రెండు వైపులా రహదారి నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ పనులను రెండు నెలల్లో పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇది పూర్తయి అండర్ పాస్‌వే ప్రజలకు అందుబాటులోకి వస్తే వారి ఇబ్బందులు తీరిపోతాయని చెప్పవచ్చు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

నేడు గాజువాక పరస: పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, ఫిబ్రవరి 1: గాజువాకలోని బీసీ రోడ్డులో ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే సీతారామ ఉమారామలింగేశ్వరస్వామి పరస శుక్రవారం జరగనున్నది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సంవత్సరం కూడా పరసను వైభవంగా నిర్వహించనున్నామని, భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మద్ది శంకరరెడ్డి, పిల్లా శంకర్‌రావు, గంధం శ్రీను, దొడ్డి రమణ, గోమాడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

14న సీతారాముల పరస

అక్కిరెడ్డిపాలెం: ఇక్కడి హరిజన జగ్గయ్యపాలెంలో సీతారాముల పరసను ఈ నెల 14న నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం కరపత్రాలను కాలనీ నాయకులు ఆవిష్కరించారు. కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడి రామాంజనేయులు, వంగలపూడి గోపి మాట్లాడుతు పరస సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు జి.సుబ్రహ్మణ్యం, యు.సుందరరావు, రవి, నాగేశ్, ఈశ్వరరావు, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

భెల్ డీజీఎంకు సమ్మె నోటీసు



డీజీఎంకు నోటీసు అందజేస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్టు భెల్ హెచ్‌పీవీపీ ఇంటక్, సీఐటీయూ నాయకులు మంగళవారం సంస్థ డీజీఎం ఎంవీఎస్ఎన్ రాజుకు సమ్మె నోటీసు అందజేశారు. నోటీసు అందజేసిన వారిలో నాయకులు ఉరుకూటి బాబూరావు, జీటీపీ ప్రకాశ్, ననపల జగన్నాథరావు, సీహెచ్‌ఎస్‌వీ నారాయణ, జి.అచ్చెన్న, తదితరులు ఉన్నారు.

ఢిల్లీ ధర్నాకు తరలిన కాంగ్రెస్ నాయకులు

గాజువాక, ఫిబ్రవరి 1: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరం, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గురువారం ఢిల్లీలో చేపట్టనున్న ధర్నాలో పాల్గొనేందుకు గాజువాకకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెల్లుబోయిన నాయుడు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పయనమయ్యారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కృషి చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కొణతాలను కలిసిన జనసేన నాయకుడు నాయుడు

పెందుర్తి, ఫిబ్రవరి 1: జనసేన పార్టీలో చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణను పెందుర్తికి చెందిన 96వ వార్డుకు చెందిన ఆ పార్టీ అధ్యక్షుడు డీబీఎల్ నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లిలో కొణతాల స్వగృహంలో కలిసి నాయకుడు పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కొణతాల సూచించారన్నారు.

పైపులైన్ ఏర్పాటుపై అభ్యంతరాలు

వేపగుంట, ఫిబ్రవరి 1: జీవీఎంసీ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్‌కు నూతనంగా ఏర్పాటు చేయనున్న పైపు లైన్ పనులకు సాయిదుర్గానగర్ వాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పైపు లైన్ కోసం సాయిదుర్గానగర్ మీదగా గతంలో పనులు చేసేందుకు అధికారులు యత్నించగా కాలనీవాసులు అడ్డుకున్నారు. దీనిపై ఇప్పటికే 'స్పందన'లో ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పటికే కాలనీలో చిన్న రహదారులు ఉన్నాయని, దీని నిర్మాణం వల్ల మరిన్ని ఇబ్బందులు వస్తాయని కాలనీవాసులు గురువారం నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు ఇబ్బంది కలగకుండా పైపు లైన్ వేయాలని, లేకుంటే ఆందోళనలకు దిగుతామన్నారు.

జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గం

వేపగుంట ఫిబ్రవరి 1: జీవీఎంసీ జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం వాసుదేవ ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎన్‌వీ రామరాజు, ఉపాధ్యక్షులుగా పి.హరిప్రసాదరావు, ఎన్.శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా ఎల్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా ఎ.సతీశ్, కోశాధికారిగా ఎల్.రమణారెడ్డి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా టి.అజిత్ కుమార్, జి.రమణయ్య, చౌదరి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డీవీ రమణ, డీవీ రాజశేఖర్ ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

ఆటోనగర్, ఫిబ్రవరి 1: వీఎస్ఈజెడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం రెండున్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ బీకే నాయుడు,ఏఈ శ్రీనివాసరావులు తెలిపారు. ఈ కారణంగా విజ్ఞాన్ కళాశాల, కాపు జగ్గరాజుపేట, ఎన్టీబీఎల్, డాక్‌యార్డు కాలనీ, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.



సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అమ్మవారి సారె ఊరేగింపు

అగనంపూడి, ఫిబ్రవరి 1: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక కొండపై వెలసిన దుర్గాభవానీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి సారెను గ్రామ పురవీధుల్లో ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చి దుర్గాభవానీకి సమర్పించారు. అమ్మవారిని పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తీర్థంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, విందుల వెంకటరమణ, బి.పైడిరాజు, వెంకటరావు, నాయుడు, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీలో రక్తదాన శిబిరం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 1: వయసుతో సంబంధం లేకుండా ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయాలని విశాఖ డెయిరీ ఎండీ ఎస్‌వీ రమణ కోరారు. డెయిరీ మాజీ చైర్మన్ ఆడారి తులసీరావు జయంతి సందర్భంగా మంగళవారం కిమ్స్ ఐకాన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డెయిరీ అధికారులు విజయారావు, జి.వెంకట్, ఎ.గోవిందరావు, ఎంఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన సుమారు వందమంది కార్మికులకు జ్ఞాపికలను అందజేశారు.

సినిమా గైడ్

● **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)

● **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)

● **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 30, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 14, క్యారెట్ 20, దొండకాయలు 30, బంగాళదుంపలు 19, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 115, మునక్కాడలు (కిలో) 95, బరబాటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 52 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30, కంద 54, దేముడుచిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	205
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



జాతీయ రహదారి షీలానగర్ వద్ద పొగమంచు



ఆటోనగర్ రహదారిలో..

పొగమంచు కమ్మేసింది..

ఉదయం 8 గంటల వరకు ఇదే పరిస్థితి..
తీవ్ర ఇబ్బందులకు గురైన వాహనదారులు

అక్కిరెడ్డిపాలెం/ఆటోనగర్, /గోపాలపట్నం, ఫిబ్రవరి 1: నగరంలోని పలు ప్రాంతాలను మంగళవారం పొగమంచు కమ్మేసింది. దీంతో వేకువజామున విధులకు హాజరయ్యే పలు పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులతో పాటు వాకింగ్‌కు వెళ్లిన వారంతా ఇక్కట్లకు గురయ్యారు. జాతీయ రహదారిని మంచు దుప్పటి కప్పేయడంతో వాహన చోదకులకు ఎదురుగా వచ్చే ఇతర వెహికల్స్ కనిపించకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. దీంతో వాహనదారులందరూ హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. షీలానగర్, బీహెచ్‌పీవీ కూడలి, ఆటోనగర్ జంక్షన్‌ల వద్దనున్న సిగ్నల్ పాయింట్లు దగ్గరకు వచ్చేంతవరకు కనిపించకపోవడంతో వాహనదారులు అగచాట్లు పడ్డారు. ఉదయం ఎనిమిది గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. కాగా గోపాలపట్నం దిగువ ప్రాంతమైన కొత్తపాలెం నుంచి నరవ గ్రామానికి వెళ్లే వరకూ వ్యవసాయ క్షేత్రాలు అధికంగా ఉండడం.. సమీపంలో చెరువులు, గెడ్డలతో పాటు రిజర్వాయర్ కూడా ఉండడంతో ఉదయం వేళల్లో దట్టమైన మంచు కురుస్తోంది. ఒకపక్క పంట పొలాలు, మరోపక్క దట్టమైన మంచుతో ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించిన పలువురు ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.



కొత్తపాలెం శివారు సంతోష్‌నగర్‌లో ఉదయం 7 గంటల సమయంలో..

తీర ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

గాజువాక, ఫిబ్రవరి 1: మిలాన్-2024 నేపథ్యంలో చేపట్టనున్న కార్యక్రమాల్లో భాగంగా డాల్ఫిన్ హిల్స్ యారాడ బీచ్ ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. గ్రేటర్ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, నేవల్ కమాండర్ సివిల్ మిలిటరీ లైసెన్స్ ఆఫీసర్ కిశోర్‌తో కలిసి గురువారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. మిలాన్-2024 సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలకు సుమారు యాభై దేశాల ప్రతినిధులు, అతిథులు, నావికాదళ ఉన్నతాధికారులు అధిక సంఖ్యలో హాజరు కానున్నందున డాల్ఫిన్ హిల్స్, యారాడ బీచ్ వరకు హెల్త్ ట్రెక్, యోగా, అతిథులకు ఆతిథ్య కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేశ్‌కుమార్, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



యారాడ తీరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, తదితరులు

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, ఫిబ్రవరి 1: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. 60వ వార్డు అశోక్‌నగర్‌లో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, నాయకులు మాత శ్రీను, రామ్మోహన్‌నాయుడు, కె.శంకర్, బి.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కో-ఆర్డినేటర్‌గా దినకర్

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పారిశ్రామిక ప్రాంతం నుంచి టీడీపీ, జనసేన నాయకులను సమన్వయం చేసేందుకు గాను పారిశ్రామిక ప్రాంతంలోని 40, 58 నుంచి 63 వార్డుల కో-ఆర్డినేటర్‌గా విశ్వనాథుల దినకర్‌ను నియమిస్తూ తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు నివాసంలో దినకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఽదినకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.



దినకర్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న గణబాబు

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం: 86వ వార్డు ఇన్‌చార్జి 'నల్లూరు'

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. మాతృశ్రీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీతం అధినేత శ్రీభరత్ ఆధ్వర్యంలో రాసాలమ్మకాలనీలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 32 రకాల వ్యాధులకు ఉచిత పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు వేగుంట శ్రీనివాస్, మాడిశ కనకరాజు, మురళీమోహన్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 1: పెదవాల్తేరు రోడ్డులోని పోలమాంబ కల్యాణ మండపంలో గురువారం జనసేన పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ కింగ్ మేకర్ అయ్యిందన్నారు. అనంతరం నేతలు కొణతాల, వంశీకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబులను కార్పొరేటర్ మూర్తి యాదవ్, తదితరులు గజమాలతో సత్కరించారు.



వంశీకృష్ణ, కొణతాల, పంచకర్లను సత్కరిస్తున్న దృశ్యం

4న ఉక్కు క్లబ్‌లో త్యాగరాజ ఆరాధనోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 1: విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) ఆధ్వర్యంలో ఈ నెల నాలుగున ఉక్కు క్లబ్‌లో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు విస్కా అధ్యక్షుడు నేమాని శ్రీనివాసశర్మ, ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ఎస్ శర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం టౌన్‌షిప్‌లో ఆరాధనోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజున విస్కా సలభై వసంతాల సావనీర్ ఆవిష్కరణతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విస్కా పూర్వ కార్యదర్శి ఎ.కేశవరావును సత్కరిస్తామన్నారు. ప్రతినిధులు కిశోర్, డి.దుర్గాప్రసాద్, శ్రీనివాస్, శివప్రసాద్, పీఎస్‌వీ సత్యనారాయణ కృష్ణవేణి, ఎం.సత్యనారాయణ, పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విస్కా ప్రతినిధులు

సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐగా శ్రీనివాసరావు



గాజువాక, ఫిబ్రవరి 1: సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐగా పి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సూర్యనారాయణ వీఆర్‌కు బదిలీపై వెళ్లడంతో పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూపోర్టు సీఐగా దాలిబాబు



పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్ స్టేషన్ శాంతిభద్రతల విభాగం సీఐగా జి.దాలిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఆయన నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించారు.

రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

పెదగంట్యాడ, జనవరి 1: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హార్బర్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ ఎస్.షణ్ముఖరావు కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా న్యూపోర్టు పీఎస్ పరిధిలోని చైతన్య కళాశాల, ప్రభుత్వ ఐటీఐలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం మిన్న అని అన్నారు. నిబంధనలు పాటించనివారు ఎలా రోడ్డు ప్రమాదాలకు గురయ్యారో దృశ్యరూపకం ద్వారా విద్యార్థులకు వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 1: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ కాలనీలో రూ.50 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్ల పనులకు గురువారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. జగన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాయకులు వేణుబాబు, దానప్పలు, దామోదర్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్నిస్ క్వాలిఫైయింగ్ పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 1: ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో భాగంగా శుక్రవారం నుంచి క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు గురువారం నగరానికి చేరుకున్నారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ప్రేమ్‌చంద్, డీఎస్ఎన్.రాజు, సతీష్, కృష్ణంరాజు పేర్కొన్నారు.

పూర్ణామార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు

» వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 1: సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్) రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిపై వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు చర్యలకు దిగారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వనాథం గురువారం పూర్ణామార్కెట్‌లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రోడ్డు మీద జంగిళ్లతో వ్యాపారం చేస్తూ నిత్యం వాహన రాకపోకలకు ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారికి పూర్ణామార్కెట్‌లో మేడ పైన ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోకి పంపే ప్రయత్నం చేశారు. పూర్ణామార్కెట్‌లో సరకులు, కూరగాయుల కొనుగోలుకు వచ్చేవారు పార్కింగ్ స్థలం ఆక్రమణలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్ణామార్కెట్ ఆశీలు కాంట్రాక్టర్ రోడ్లపైన వ్యాపారాలను ప్రోత్సహిస్తూ, వారి నుంచి అక్రమంగా ఆశీలు వసూలుకు పాల్పడుతుండడంతో ఫుట్‌పాత్, రోడ్లు, వాహనపార్కింగ్ స్థలాలు చిరు వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయని ఎప్పటి నుంచో వర్తక సంఘాలు ఆరోపిస్తున్నాయి. మార్కెట్ లోపల అద్దెలు చెల్లించి వ్యాపారం చేస్తున్నవారికి రోడ్డుమీద వ్యాపారాలతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈనేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు మార్కెట్ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి సారించడంపై వినియోగదారులతో పాటు, వర్తకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పూర్ణామార్కెట్ రహదారిలో ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సమస్యలు పరిష్కరించే నేతను ఎన్నుకోవాలి

మర్రిపాలెం, ఫిబ్రవరి 1: నిత్యం ప్రజల మధ్య ఉంటూ, సమస్యలను పరిష్కరించే నాయకులనే ప్రతినిధులుగా ఎన్నుకోవాలని మాజీ ఎమ్మెల్యే విషుకుమార్‌రాజు అన్నారు. గ్రేటర్ 54వ వార్డు మర్రిపాలెం మహరాణివీధిలో గురువారం ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గంలోని అన్ని వార్డులో సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేశానన్నారు. మళ్లీ ఓటువేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాళ్ల అదిబాబు, రాంబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.


మహారాణివీధిలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావు

మర్రిపాలెం, ఫిబ్రవరి 1: కంచరపాలెం ట్రాఫిక్ సీఐగా అమిటి ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీఐ మళ్ల అప్పారావుతోపాటు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ప్రసాదరావు నగరంతోపాటు శ్రీకాకుళంలోని పలు పోలీసుస్టేషన్‌లో లాఅండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల్లో పనిచేశారు. పదోన్నతుల్లో భాగంగా కంచరపాలెం ట్రాఫిక్ సీఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వాసుదేవరావు, ఉల్‌హక్, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రసాదరావును అభినందిస్తున్న పోలీసు సిబ్బంది

త్వరితగతిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ: కలెక్టర్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 1: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ త్వరితగతిన జరుగుతోందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. వీలైనంత త్వరగా స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను సొసైటీ కార్యవర్గం కలిసింది. ఇప్పటికే దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన పూర్తయిందని, అర్హులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు జి.జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్, పీఏ రావు, రమేష్, శ్రీనివాసరావు, శివప్రసాద్, చిట్టిబాబు, అనురాధ, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

43వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 1: గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ ఆధ్వర్యంలో గురువారం 131 నెంబరు పోలింగ్ బూత్ పరిధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని పిలుపునిచ్చారు.


కరపత్రాలు అందిస్తున్న బొడ్డేటి మోహన్

ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో రైల్వే జీఎం తనిఖీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1: తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ గురువారం ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో తనిఖీ చేశారు. యూనిట్లు, సిబ్బంది సౌకర్యాలను పరిశీలించారు. సాంకేతిక నిపుణులు, సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఎలక్ట్రో మాగ్నెటిక్ ట్రాక్ డిటెక్షన్ యూనిట్, ఎయిర్ డ్రెయిర్ టెస్ట్ బెంచ్, లోకో బాడీ వాషింగ్ అండ్ క్లీనింగ్, వర్షం నీరు లీకేజీ డిటెక్షన్ యూనిట్లను ప్రారంభించారు. డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, ఏడీఆర్ఎంలు, ఇతర బ్రాంచి అధికారులు పాల్గొన్నారు.


డిటెక్షన్ యూనిట్లను ప్రారంభిస్తున్న మనోజ్‌శర్మ

చదువుపైనే దృష్టి సారించాలి: డీఈవో

సీతమ్మధార, ఫిబ్రవరి 1: ప్రతి విద్యార్థి చదువుపైనే దృష్టి పెట్టి లక్ష్యం చేరుకునే విధంగా మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి లంక చంద్రకళ పేర్కొన్నారు. సీతమ్మధార పిఅండ్‌టి కాలనీలో గల ఎన్ఎంసిహెచ్ పాఠశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ట్యాబ్‌లను చదువు నిమిత్తం వాడుకోవాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా ఆలకించాలన్నారు. నోట్ పుస్తకాలను పరిశీలించారు. తరగతి గదుల్లో బెంచీలు లేవని ఆమె దృష్టికి తేవడంతో మరో స్కూల్‌లో ఉంటే తెచ్చుకోవాలని హెచ్ రాంప్రసాద్‌కు సూచించారు.


విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈవో చంద్రకళ

జనసేనలో చేరిన మహిళలు


పార్టీలో చేరిన వారితో ఉత్తర నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 1: గ్రేటర్ 44వ వార్డు జనసేన అధ్యక్షుడు పడాల పరమేశ్వరరావు అధ్యక్షతన గురువారం జనంతో జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డేటి హేమ కల్యాణి, ఉండమట్ల వరలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఆ పార్టీలో చేరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ముమ్మిన నాగమణి, భాస్కర్, సంధ్యా మాధురి, ఏసు, ఆచంట కిరణ్, సత్యప్రసాద్, గణేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

48వ వార్డు కార్యవర్గం ఏర్పాటు

కంచరపాలెం: జనసేన 48వ వార్డు అధ్యక్షుడిగా ఉప్పులూరి శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారి నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయమే ధ్యేయంగా కార్యకర్తలంతా పని చేయాలన్నారు.

ప్రజా పక్షపాతి బాలకృష్ణ: మాజీ ఎమ్మెల్సీ శర్మ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 1: ప్రజా పక్షపాతి కామ్రేడ్ ఎ.బాలకృష్ణ అని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ కొనియాడారు. గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ సంతాప సభకు డా.బి.గంగారావు అధ్యక్షత వహించారు.ముందుగా బాలకృష్ణ చిత్ర పటానికి శర్మతో పాటు జీవీఎన్ చలపతి, ఎస్.సుధాకర్, జగ్గునాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నం విద్యార్థి ఉద్యమంలో బాలకృష్ణ చురుకైన పాత్ర పోషించారన్నారు. ఉద్యమకారుడిగా, కార్మిక కర్షక పక్షపాతిగా పేరు సంపాదించుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేఎస్వీ కుమార్, జగన్, పద్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


బాలకృష్ణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శర్మ

'మతాన్ని రాజకీయం చేస్తున్నారు'

సీతమ్మధార, ఫిబ్రవరి 1: మతాన్ని రాజకీయం చేస్తున్నారని ఆర్‌పీఐ జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్‌లో గురువారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ప్రధాన పూజారి అయ్యారని, రాముడు రాజకీయ నాయకుడు అయ్యాడన్నారు. రాజకీయ చైతన్యం ప్రజల్లో కల్పించే ఉద్దేశంతో ఈ నెల 4న అంబేడ్కర్ భవన్‌లో సభ నిర్వహిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 1: నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఏఎస్ఆర్‌నగర్, వోల్వో ఆఫీస్, మైత్రి ఇన్, వుడా చిల్డ్రన్ పార్క్ ఏరియాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

తహసీల్దారు బదిలీల్లో పలుకుబడికే ప్రాధాన్యం

» మండలాలకు కేటాయింపుల్లోనూ వారిదే పైచేయి

» అల్లూరి, మన్యం జిల్లాలకు మహిళల కేటాయింపుపై అసంతృప్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జోన్-1లో జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యత ఇచ్చారని రెవెన్యూ ఉద్యోగుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం నగరాలకు ఆనుకుని పనిచేసిన తహసీల్దార్లు కోరుకున్న జిల్లాలకు కేటాయించారు. చివరకు జిల్లాల పరిధిలో పోస్టింగ్స్ ఇవ్వడంలో పలుకుబడి గల వారికే అనుకూలమైన మండలాలు కేటాయించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో పలుకుబడిలేని తహసీల్దార్లల్లో ఎక్కువ మందికి పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీ చేశారని అంటున్నారు. ఇంకా పలువురు మహిళలకు మైదాన జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం కాకుండా అల్లూరి, మన్యం జిల్లాలకు పంపారని గుర్తుచేస్తున్నారు. విశాఖ నగరం చుట్టూ మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లలో తమకు నమ్మకంగా ఉండే వారిని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కేటాయించారని పేర్కొంటూ ఆయా జిల్లాల్లో కూడా వారు కోరుకున్న మండలాల్లో పోస్టింగ్స్ ఇచ్చారని రెవెన్యూ వర్గాల్లో చర్చ సాగుతుంది.

విశాఖ నగర శివారుల్లో డీ పట్టా భూములను పాలకపార్టీ పెద్దలకు కొనిపెట్టే వ్యవహారంలో పరిధికి మించి పనిచేసిన తహసీల్దార్లకు మంచి మండలాలకు బదిలీ చేశారన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వరకు తీరం పొడవునా ఉన్న మండలాల్లో సుమారు 1000 ఎకరాల డీపట్టాభూములు కొనుగోలు చేయాలని పాలక పెద్దలు, సీనియర్ అధికారులు కొందరు ప్రణాళిక వేసుకున్నారు. దాని మేరకు ఇప్పటికే కొంతమేర డీ పట్టా భూములను రైతుల నుంచి కొనుగోలుకు మార్గం సుగం చేశారని రెవెన్యూలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అనుకున్న మేర భూముల కొనుగోలుకు ఇబ్బంది లేకుండా తమకు నమ్మకమైన తహసీల్దార్లకు జాతీయ రహదారి పరిసర మండలాలకు కేటాయింపులో పాలక పెద్దలు రెవెన్యూ ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగర శివారుల్లో పనిచేసి పలు రకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్లను పనిష్మెంట్‌పై దూర ప్రాంత మండలాలకు పంపాలి కానీ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో జాతీయ రహదారి, జిల్లా కేంద్రాలకు ఆనుకుని మండలాల్లో పోస్టింగ్స్ ఇచ్చారని రెవెన్యూ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇదిలావుండగా శ్రీకాకుళం జిల్లాలో పనిచేసే మహిళా తహసీల్దార్లు, విశాఖ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసే మహిళను తీసుకెళ్లి అల్లూరి సీతారామరాజు, మన్యం జిల్లాలకు కేటాయించడాన్ని రెవెన్యూ వర్గాలు తప్పుబడుతున్నాయి. సాధారణ ఎన్నికలు ముగిసిన తరువాత పనిచేసే జిల్లాలకు తహసీల్దార్లంతా తిరిగి వస్తారు. అయితే అప్పటి వరకు పలుకుబడి ఉన్న వారంతా, పాలక పెద్దల అవసరాలు తీర్చే వారికి తగిన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కోరుకున్న మండలాల్లో పోస్టింగ్స్ తీసుకున్నారని రెవెన్యూ ఉద్యోగి ఒకరు వ్యాఖ్యానించారు.

హిందీకి పెరుగుతున్న ఆదరణ

» డీఆర్‌డీవో డీజీ డాక్టర్ వై.శ్రీనివాసరావు

» రాజభాష సైంటిఫిక్ అండ్ టెక్నికల్ సెమినార్ ప్రారంభం

గోపాలపట్నం, ఫిబ్రవరి 1: దేశం మొత్తం ఐక్యంగా ఉంచే మాధ్యమంగా హిందీ భాష కీలకపాత్ర పోషిస్తుందని, శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికతను అనుసంధానం చేయడంలో రాజభాషకు ఆదరణ పెరుగుతుందని డీఆర్‌డీవో డీజీ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. అఖిల భారత సం యుక్త రాజభాష సైంటిఫిక్ అండ్ టెక్నికల్ సెమినార్ ఎన్ఎస్‌టీఎల్‌లోని మానసి ఆడిటోరియంలో గురువారం ప్రారంభమైంది. డీఆర్‌డీవో హైదరాబాద్ క్లస్టర్ పరిధిలో నిర్వహించిన ఈ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజభాష అభివృద్ధికి ఎన్ఎస్‌టీఎల్ చేస్తున్న కృషిని అభినందించారు. ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్ పీజే నివారే మాట్లాడుతూ దేశ సరిహద్దులను సురక్షితం చేయడంతో డీఆర్‌డీవో ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. సాంకేతికత బదిలీ, సమన్వయానికి ఎన్ఎస్‌టీఎల్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. డీఆర్‌డీవో డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసింగ్ రాజభాషను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ మాట్లాడుతూ నౌకాదళం కోసం అత్యాధునిక ఆయుధాలను తయారుచేయడంలో ఎన్ఎస్‌టీఎల్ కృషిని వివరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సెమినార్‌లో జరిగే చైతన్యవంతమైన చర్చలు శాస్త్రీయ, సాంకేతిక పురోగమనానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెమినార్ చైర్మన్ సి.కేదర్‌నాథ్, ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


డాక్టర్ వై.శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వరుగీస్

ఫ్చ..

... 5వ పేజీ తరువాయి

అన్ని రాష్ట్రాల్లో ఐకానిక్ టూరిస్ట్ సెంటర్లను ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఏపీకి విశాఖపట్నం పర్యాటక రాజధాని కాబట్టి ఇక్కడ ఓ సెంటర్ పెట్టే అవకాశం ఉంది.

» మెట్రో రైళ్లు, నమో భారత్ రైళ్లు పెంచుతామని ప్రకటించారు. విశాఖ మెట్రో ప్రాజెక్ట్ విషయం వెల్లడించలేదు. రాష్ట్రం డీపీఆర్ పంపించామని చెబుతోంది. అది అందిందో లేదో కూడా తెలియదు.

» గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఆఫ్ షోర్ విండ్ ఎనర్జీని ప్రోత్సహించాలని నిర్ణయించారు. సముద్ర తీర ప్రాంతాల్లో వీటిని పెడతారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలు దీనికి అనుకూలం. కొత్త పెట్టుబడులు వస్తాయి.

బాలికలకు తప్పనున్న క్యాన్సర్ ముప్పు



దేశంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు చాలా అధికం. దీనిని ముందుగానే నివారించడానికి 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చాయి. వాటిని ప్రభుత్వమే ఉచితంగా వేస్తుందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల ఎంతో మంది లబ్ధి కలుగుతుంది. భవిష్యత్తులో ఈ తరహా క్యాన్సర్ కేసులు తగ్గిపోతాయి. అయితే విదేశాల్లో ఈ వ్యాక్సిన్ మగపిల్లలకు కూడా ఇస్తున్నారు. ఇక్కడ కూడా అలా చేయాలి.

- డాక్టర్ మురళీకృష్ణ, మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి

ఊరించి... ఉసూరుమనిపించి

... 5వ పేజీ తరువాయి

సెంటర్లు చుట్టూ తిరుగుతూ, రూముల్లో ఉండి చదువుకుంటున్న తమను ప్రభుత్వం దగా చేసిందని డీఎస్సీ అభ్యర్థి రామకృష్ణ వాపోయాడు. ఈ మోసానికి వేలాది మంది జీవితాలు నాశనమయ్యాయని స్వాతి అనే అభ్యర్థిని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని నిరుద్యోగ సంఘ నాయకుడు రాజు హెచ్చరించారు.

ఆరేళ్ల కిందట చివరి నోటిఫికేషన్..

చివరిసారిగా 2018లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఆ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 7,900 పోస్టులను భర్తీచేశారు. అయితే నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఆయన మాటలు నమ్మి గత ఎన్నికల్లో నిరుద్యోగులు వైసీపీకి ఓటేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి మర్చిపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి కావస్తోంది. ఇప్పటివరకూ ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేసిన పాపాన పోలేదు. ఎన్నికలకు కొన్నిరోజులు ముందు, అదీ నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో నామమాత్రపు పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆనందం లేకుండాపోయింది

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైందన్న ఆనందం నిరుద్యోగులకు లేకుండా పోయింది. అరకొర పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడమే కాకుండా మళ్లీ అప్రెంటిస్ విధానాన్ని తీసుకురావడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుంది. పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు ఆ విధానాన్ని రద్దు చేయాలి. కనీసం 20 వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలి.

- ఎం.రాజేష్, డీఎస్సీ అభ్యర్థి

పరీక్షల సీజన్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఎంపీసీ విద్యార్థులు 32,982 మంది, బైపీసీ విద్యార్థులు 4,945 మంది హాజరవుతారు. తొలి దశలో ఈనెల 11 నుంచి 15 వరకు 129 కళాశాలలు, రెండో దశలో 16 నుంచి 20 వరకు 102 కళాశాలల విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. 50 మంది కంటే తక్కువ ఉన్న కళాశాలల్లో ప్రాక్టికల్స్‌కు సెంటర్లు కేటాయించలేదు. ఇటువంటి కళాశాలల విద్యార్థులకు సమీపంలోని మరో కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం అవుతాయి.

ఏసీపీల బదిలీ

... 5వ పేజీ తరువాయి

నియమించింది. స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా పనిచేస్తున్న వై.గోవిందరావును కోనసీమ జిల్లా దిశ స్టేషన్ డీఎస్పీగానూ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.బాపూజీని అన్నమయ్య జిల్లా దిశ స్టేషన్ డీఎస్పీగా బదిలీచేసింది. ఇప్పటివరకూ ఖాళీగా ఉన్న నార్త్ సబ్‌డివిజన్ ఏసీపీగా కృష్ణా జిల్లా సీసీఎస్ డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్ మురళీకృష్ణను, ద్వారకా ఏసీపీగా కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.రాంబాబును నియమించింది.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

అల్లిపురం, ఫిబ్రవరి 1: జీవీఎంసీ 34వ వార్డు పరిధిలోని లబ్ధిదారులకు ఇటీవల మంజూరైన 59 ఇళ్లపట్టాలను వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో గురువారం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో రోడ్లు,డ్రైనేజీలు వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ నాయకులు లింగం శ్రీను, లండ రమణ, యూసీడీ సీఓ మంగ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు స్లీపర్ కోచ్‌లు పెంచాలని వినతి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 1 : భువనేశ్వర్ - సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు స్లీపర్ కోచ్‌లు పెంచాలని సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. గురువారం ఆయన రైల్వే మంత్రిత్వ శాఖకు, డివిజనల్ రైల్వే మేనేజర్‌కు లేఖలు రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఈ రైలు ఉత్తరాంధ్ర ప్రజలకు ఉపయోగపడుతోందని, ఉపాధి నిమిత్తం పేద, మధ్య తరగతి ప్రజలు హైదరాబాద్ వెళ్లి రావడానికి ఇదే అనువైనదని పేర్కొన్నారు. 12 స్లీపర్ కోచ్‌లతో నడిచే ఈ రైలును గత ఏడాది మూడు కోచ్‌లకు కుదించడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు సమస్య తీవ్రతను పరిశీలించి, స్లీపర్ కోచ్‌ల సంఖ్యను పెంచాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 1: మనిషి తప్ప ప్రతి జీవి పర్యావరణ హితంగా జీవిస్తోందని గ్రీన్ క్లైమెట్ ఎన్‌జీవో సంస్థ కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. గురువారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో పర్యావరణ హిత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ పర్యావరణంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడం వల్ల దేశం పర్యావరణహితంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విద్యార్థులు భరద్వాజ్, కుమార్, నాని, రాజేశ్వరి, యామిని, తదితరులు పాల్గొన్నారు.

జోన్-2 ఆర్‌ఓగా శివకుమార్



జడ్సీ కనకమహాలక్ష్మికి నియామక ఉత్తర్వులు ఇస్తున్న ఆర్‌ఓ శివకుమార్

కొమ్మాది, ఫిబ్రవరి 1 : జోన్-2 కార్యాలయం ఆర్‌ఓగా వైవీ శివకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జీవీఎంసీలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జోన్-2 కార్యాలయంలో ఆర్‌ఓగా పనిచేస్తున్న రమేష్ జోన్-3కి బదిలీ కావడంతో ఆయన స్థానంలో జోన్-3 నుంచి శివకుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

పాదచారులకు ఇబ్బందులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 1 : మార్నింగ్ వాకింగ్ కోసం వచ్చేవారికి దారిలో పలువురు అడ్డంకులు సృష్టిస్తున్నారు. హనుమంతువాక నుంచి అప్పుఘర్ రోప్ వే వరకూ ఉడా నిర్మించిన హెల్త్ ఎరీనాకు ఉదయం చాలామంది వాకింగ్‌కు వస్తుంటారు. ఇందులో యువకుల నుంచి 70 ఏళ్ల వృద్ధులు, మహిళలు కూడా ఉన్నారు. దారి మధ్యలో కొందరు షటిల్ ఆడుతూ పాదచారులు, వాకింగ్‌కు వచ్చేవారిని ఇబ్బందులు పెడుతున్నారు. కొద్ది రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా.. ఎవరూ స్పందించడం లేదు.

అర్హులందరికీ ఓటుహక్కు: తహసీల్దార్

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 1 : అర్హులైన వారు ఓటరుగా నమోదు కావడానికి ఆన్‌లైన్‌లో ఇంకా సమయం ఉందని తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సవరించిన తుది ఓట్ల జాబితాను గురువారం ఆయన తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఓట్ల వివరాలు సరిచూసుకోవాలన్నారు. మరణించిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలు, వలస వెళ్లిన పేర్లు గుర్తించి, సిబ్బంది తొలగించాలని ఆదేశించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 1 : మండలంలోని నగరపాలెంలో రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం రాధాకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు వేలమందికి అన్న సమారాధన చేశారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19,టమాటా 30, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 14, క్యారెట్ 20, దొండకాయలు 30, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 95, అల్లం (పాతది) 115, బరబటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 52 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

నత్తనడకన యూజీడీ పనులు

ఆరిలోవ, ఫిబ్రవరి 1 : దీనదయాళపురం నుంచి పెదగదిలి జంక్షన్ వరకు రూ.3.5 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఇప్పటికి ఆరు నెలలు పూర్తయినప్పటికీ సగం కూడా కాలేదు. డ్రైనేజీ తవ్వి గొట్టాలు వేశారు కానీ గోతులను తవ్విన మట్టిని మాత్రం తొలగించకుండా అలానే వదిలేశారు. దీంతో వీధుల్లో ఎక్కడికక్కడ పెద్ద పెద్ద మట్టి పోగులు కనిపిస్తున్నాయి. దీనివల్ల స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడడంతో పాటు దుమ్ము, ధూళితో నరకం అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము రేగి ఇళ్లల్లో చేరుతుండడంతో సామగ్రి పాడవుతున్నది. అధికారులు తక్షణమే స్పందించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో భాగంగా గోతుల నుంచి తీసిన మట్టి



పదోన్నతి పొందిన ట్యాక్స్ కలెక్టర్లతో మేయర్ వెంకట కుమారి, అధికారులు

18 మందికి ట్యాక్స్ కలెక్టర్లుగా పదోన్నతి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 1 : ట్యాక్స్ కలెక్టర్లుగా పదోన్నతి పొందినవారు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని మేయర్ గొలగాని హరివెంకట కుమారి తెలిపారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో ఆఫీసు సబార్డినేటర్లు, పీహెచ్ వర్కర్లు, నాన్ పీహెచ్ వర్కర్లకు ట్యాక్స్ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్యాక్స్ కలెక్టర్లుగా పదోన్నతి పొందిన వారు జీవీఎంసీలో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందడంతో పాటు జీవీఎంసీ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఏఓ (అడ్మిన్) పి. పద్మజ, పర్యవేక్షకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం

సింహాచలం, ఫిబ్రవరి 1 : సింహ గిరిపై గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని సెజ్ కాలనీకి చెందిన శ్రీ స్వయంభూ సిద్ధి వినాయక బృంద సభ్యులు కోలాటం ప్రదర్శించారు. సభ్యులు పలు దేవతా మూర్తులను గీతాల రూపంలో కీర్తిస్తూ కోలాటం చేశారు. అనంతరం దేవాలయ అధికారులు సహకారంతో స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాద విభాగంలో ప్రసాదాన్ని స్వీకరించారు.

రూ. 77.36 లక్షలతో అభివృద్ధి పనులు

సింహాచలం, ఫిబ్రవరి 1 : జీవీఎంసీ 98వ వార్డులోని పలు ప్రాంతాల్లో రూ.77.36 లక్షల జీవీఎంసీ సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు వార్డు కార్పొరేటర్ వరాహనరసింహం తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రభుత్వ ఆస్పత్రి వెనుక వైపు నుంచి స్థానిక స్వామి కల్యాణ మండపం వరకు రూ. 19.75 లక్షలతో, ఆకులవీధిలో రూ.12.66లక్షలతో, గాంధీనగర్‌లో రూ.14.75 లక్షలతో, టివి టవర్ కాలనీలో రూ.13.7 లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టులు నిర్మించనున్నట్టు చెప్పారు. అలాగే పాత అడివివరంలోని హరిహరానంద నగర్‌లో రూ.16.5లక్షలతో బీటీ రోడ్డు నిర్మిస్తామన్నారు.

అప్పన్నను దర్శించుకున్న విదేశీయులు



స్వామివారి సన్నిధిలో విదేశీయులు

సింహాచలం, ఫిబ్రవరి 1 : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఇంగ్లండ్‌కు చెందిన పలువురు క్రికెట్ అభిమానులు గురువారం దర్శించుకున్నారు. సుమా రు 70 మంది దేవస్థానం బస్సులో సింహగిరికి చేరుకుని అతి శ్రీఘ్రదర్శనం చేసుకుని ఉచిత ప్రసాదాన్ని తీసుకున్నారు. అనంతరం సింహగిరి క్షేత్ర మహాత్మ్యాన్ని, అందాలను గైడ్ సహకారంతో తెలుసుకుని పలు సుందర దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు.

జోనల్ కమిషనర్ రాముకు సన్మానం



జడ్సీ రామును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 1 : భీమిలి జోనల్ కమిషనరు బొడ్డేపల్లి రాముకు తూర్పు గోదావరి జిల్లా మండపేటకు బదిలీ కావడంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తన క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్సీ మధురవాడ, భీమిలి జోన్‌లలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని, అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని కొనియాడారు. అనంతరం ఆయన జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి కొండపైకి ఘాట్‌రోడ్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, మహాత్మాగాంధీ కల్యాణ మండపం శిథిలం కావడంతో కొత్తగా కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, 3వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి మైలపల్లి షణ్ముఖరావు, అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదజాలారిపేటలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 1 : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటలో కార్పొరేటర్ నొల్లి నూకరత్నం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు వంద మంది రోగులను వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తేడ్డు రాజు, బీపీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన జీవీఎంసీ అదనపు కమిషనర్



వెంకోజీపాలెం, ఫిబ్రవరి 1 : జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన విశ్వనాథన్ మేయర్ హరి వెంకట కుమారిని గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నగరానికి ఎన్నో సేవలందించి, జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా బదిలీపై వచ్చిన విశ్వనాథన్‌ను అభినందిస్తూ ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందించాలని కోరారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఫిబ్రవరి 1 : వరాహలక్ష్మీనృసింహస్వామికి గురువారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ముందుగా ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి. భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్క స్వర్ణ సంపెంగలతో అర్చన జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణం నిర్వహించారు.

'బీసీలకు రాజ్యాధికారం అవసరం'



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

రామ్‌నగర్, ఫిబ్రవరి 1 : రాజ్యాధికారమే లక్ష్యంగా అన్ని బీసీ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి వచ్చే ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశాన శంకరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన బీచ్ రోడ్డులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లా డారు. రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలను వాడుకుంటున్నాయని, బీసీ సంఘాల నాయకులు వారి పదవులను కాపాడుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు తప్ప రాజ్యాధికారం దిశగా ఆలోచన చేయడం లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎవరైతే బీసీలకు సముచిత స్థానం కల్పిస్తారో వారికి మాత్రమే మద్దతు తెలియజేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎన్ని శ్రీనివాసరావు, గొర్లె శ్రీనివాస నాయుడు, కర్రి ధనుంజయనాయుడు, పల్లా రమణ యాదవ్, కామణ వెంకట సుబ్బారావు, పల్లి శ్రీనివాసనాయుడు, సంపద్ శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

పెదవాల్తేరు, ఫిబ్రవరి 1 : రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లోనూ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి గారపాటి సీతారామాంజనేయ చౌదరి తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విశాఖ పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణ కార్యాలయాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సం క్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర కోశాధికారి ఎం. నగేంద్ర, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలో నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ

తగరపువలస, ఫిబ్రవరి 1 : సంగివలస ఎన్ఆర్ఐ నర్సింగ్ కళాశాలలో 13 నర్సింగ్ కళాశాలలకు సంబంధించి శిక్షణ గురువారం నుంచి ప్రారంభమైంది. శిక్షణను కళాశాల డీన్ డా. పీవీ సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 వరకు శిక్షణ ఉంటుందని, బోధకుడిగా డా. సి. రాకేష్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సీబా ఫ్రాన్సిస్, పరిపాలనా అధికారి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 1 : గంధవరం పీఏసీఎస్ ద్వారా రైతులు తీసు కున్న రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు పల్లి గోవింద్ కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29లోగా రెన్యూవల్ చేసుకుంటే ఏడు శాతం వడ్డీ పడుతుందని, తరువాత 13 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటున్నారు.రుణాల రెన్యూవల్‌కు ఆధార్, రెండు ఫొటోలు, బ్యాంకు అకౌంటు, రేషన్ కార్డు జిరాక్సు తీసుకురావాలని సూచించారు.

మద్య నిషేధం అమలు ఎక్కడ ?

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 1 : మద్యపాన నిషేధంపై వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని టీడీపీ మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు బొదల పావని ప్రశ్నించారు. గురువారం ఆమె అనంతవరం, గొల్లలపాలెం. కొవ్వాడ గ్రామాల్లో చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పలసూర్యనారాయణ, ఎస్. వెంటరావు, ఎస్. రమణమ్మ, బొదల గౌరీశంకర్, తాతాజీ, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి : యూటీఎఫ్


పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 1 : ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, ధర్నాలు, దీక్షలు చేస్తే ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేశారని, వైసీపీ ప్రభుత్వం తిరిగి అప్రెంటీస్ విధానాన్ని ప్రకటించడం అన్యాయమని యూటీ ఎఫ్ ప్రతినిధి ఉప్పాడ రాము అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేబినేట్ సమావేశంలో 6.100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదించి, అప్రెంటీస్ విధానాన్ని పునరుద్ధరించడం అన్యాయమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండేళ్ల పాటు గౌరవ వేతనంతో సర్వీసు కొనసాగించాలంటే బతుకు భారమవుతుందని పేర్కొన్నారు.

స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగంలో ఏయూ ప్రగతి

వెంకోజీపాలెం/విశాలాక్షినగర్, ఫిబ్రవరి 1 : స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో ఏయూ వేగంగా ప్రగతి సాధిస్తోందని పర్డు యూనివర్సిటీ ఎంటర్ ప్యూనర్‌షిప్ ప్రోగ్రాం కన్సల్టెంట్ జూలియాన కాసవాన్ అన్నారు. గురువారం ఆమె వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూలో కేవలం రెండేళ్లలో 150కి పైగా స్టార్టప్ సంస్థలు ఇక్కడ పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంత రం వీసీ ఆమెను సత్కరించారు. కాగా వీసీ ప్రసాదరెడ్డిని సినీ నటుడు జోగినాయుడు అభినందించారు. ప్రసాదరెడ్డి రెండోసారి వీసీగా నియామితులు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విశాలాక్షినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు కూడా కలిసి అభినందనలు తెలిపారు. ప్రసాదరెడ్డి విశాలాక్షినగర్‌లో నివాసం ఉండడంతో సభ్యులు ఆయన్ను కలిసి సన్మానించారు.

ఏయూని సందర్శించిన నాగాలాండ్ యూనివర్సిటీ విద్యార్థులు

విజ్ఞాన యాత్రలో భాగంగా నాగాలాండ్ సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు ఏయూను సందర్శించారు. ఏయూలోని ఆర్ట్స్ కళాశాలను సందర్శించగా డిపార్టుమెంట్ శాఖాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు వారికి ఏయూ విశేషాలను వివరించారు.



పెదవాల్తేరు రోడ్డులోని పోలమాంబ కల్యాణ మండపంలో గురువారం జనసేన పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కొణతాల రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనంతరం కొణతాల, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కార్పొరేటర్ మూర్తి యాదవ్, తదితరులు గజమాలతో సత్కరించారు.

- పెదవాల్తేరు, ఆంధ్రజ్యోతి



బదిలీ అయిన అధికారులతో కమాండెంట్ గౌతమీ శాలి

బెటాలియన్‌లో 25 మంది అధికారులకు బదిలీ

కొమ్మాది, ఫిబ్రవరి 1 : బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 25 మంది అధికారులకు బదిలీ కావడంతో వారందరినీ బెటాలియన్ కమాండెంట్ గౌతమీ శాలి గురువారం ఘనంగా సన్మానించారు. బదిలీ అయినవారిలో బెటాలియన్ అదనపు కమాండెంట్ శ్యామ్యూల్ జాన్, లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జి. ఎలియా సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఔషధ పరిశోధనల్లో సీసీఆర్ఏఎస్ కృషి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 1 : దేశంలోని ఔషధ పరిశోధనలు సామాన్యులకు చేరువ కావడానికి కేంద్ర ప్రభుత్వ అయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్) విశేషంగా కృషి చేస్తోందని సెంట్రల్ ఆయుర్వేదిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ జి. బాబు తెలిపారు. గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఆరోగ్య రక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు.కరోనా సమయంలో అయుష్-64 ఔషధం దేశవ్యాప్తంగా వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. భారత ప్రభుత్వ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ ఎ. రామకిషన్ మాట్లాడుతూ భారత ఔషధ పరిశ్రమ 53 బిలియన్ డాలర్ల వృద్ధి సాధించిందని, ప్రపంచంలోనే ఔషధ ఉత్పత్తులకు కేంద్రంగా మారిందని చెప్పారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాజా, ప్రొఫెసర్ జి. శివకుమార్, తది తరులు పాల్గొన్నారు.

ఇద్దరిని కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 1 : రుషికొండ తీరంలో సముద్ర స్నానాలకు దిగి ప్రమాదానికి గురైన ఇద్దరు బీహార్ యువకులను లైఫ్‌గార్డులు రక్షించారు. బీహార్‌కు చెందిన 25 మంది పర్యాటకులు విహార యాత్ర కోసం గురువారం రుషికొండ తీరానికి వచ్చారు. వారంతా సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద అల తాకడంతో అసద్ (28), షాహిల్ (30) ప్రమాదానికి గురయ్యారు. వెంటనే అక్కడికి సమీపంలో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డులు వారిని గమనించి, సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

10, 11 తేదీల్లో హిందీ పరీక్షలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 1 : చెన్నైకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే పరీక్షలు ఈనెల 10, 11 తేదీల్లో జరగనున్నట్టు ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హిందీ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు 10, 11 తేదీల్లోనూ, లోయర్ గ్రేడ్ పరీక్షలు 11న జరుగుతాయన్నారు. పట్టణంలోని సుభాష్ రోడ్డులో వున్న జీవీఎంసీ పండిట్ నెహ్రూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

తాత్కాలికంగా మార్గం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆరిలోవ, ఫిబ్రవరి 1 : పెదగదిలి నుంచి తోటగరువుకు వెళ్లే రోడ్డులో బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండడంతో స్థానికుల రాకపోకలకు అధికారులు తాత్కాలికంగా మార్గం ఏర్పాటు చేశారు. తోటగరువులో బ్రిడ్జి నిర్మాణం దృష్ట్యా జీవీఎంసీ అధికారులు రోడ్డును మూసివేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు.ఈమేరకు స్థానికుల రాకపోకల కోసం సుమారు ఆరు అడుగుల మార్గాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.అయితే పెదగదిలి జంక్షన్ నుంచి కాలువ రోడ్డు వరకూ ఉన్న మార్గంలో తుప్పలు తొలగించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 1 : జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భాగస్వాములవుతున్నారు. ఈనెల 5 నుంచి 11 వరకు పంజాబ్‌లోని పటియాలాలో చిత్కర వర్సిటీలో జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూకు చెందిన 10 మంది వలంటీర్లు, ప్రోగ్రాం అధికారి హాజరవుతున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి గురువారం వారిని తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ సేవా పథకం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఉపయుక్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్. హరనాథ్ పాల్గొన్నారు.

ఆనందపురం ఎంపీడీవోగా అప్పలనాయుడు

ఆనందపురం, ఫిబ్రవరి 1 : ఆనందపురం ఎంపీడీవోగా ఎన్. అప్పలనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎంపీడీవో లవరాజు విజయనగరం జిల్లా డెంకాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా భోగాపురం ఎంపీడీవోగా ఉన్న అప్పలనాయుడు బదిలీపై వచ్చారు. నూతన ఎంపీడీవోను ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, జెడ్‌పీటీసీ కోరాడ వెంకటరావు, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.